
# వరంగల్ వాయిస్
*Evening Daily*

సంపుటి : 05 | సంచిక : 067
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
ఫిబ్రవరి 21, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## రేపు మానుకోటకు సీఎం రేవంత్ రెడ్డి


మహబూబాబాద్ జిల్లా రెడ్యాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. ఇటీవల వెన్నం రాఘవేందర్ రెడ్డి మృతి చెందగా వారి కుమారులు బిగ్ టీవీ చైర్మన్ విజయ్ కాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలను పరామర్శించేందుకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్యాలకు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

–వరంగల్ వాయిస్, మహబూబాబాద్




# పవరున్నోడు
## పావుశెట్టి సునీల్ కుమార్

- ఎస్టీడీ బూత్ నుంచి మున్సిపల్ పీఠం వరకు
- ఆసక్తికరంగా రాజకీయ ప్రస్థానం
- పరకాల మోడల్ మున్సిపాలిటీనే ఆయన లక్ష్యం
- టీమ్ వర్క్‌తో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే రేవూరి సహకారంతో ముందుకు




పోరాటాల గడ్డ.. రాజకీయ చైతన్యానికి అడ్డా అయిన పరకాలలో రాజకీయం చేయడం అంటే కత్తిమీద సామే. ఉద్దండ పిండాలకే చెమటలు పట్టించే ఈ గడ్డపై తనదైన స్టైల్ లో దూసుకుపోతున్నాడు పావుశెట్టి సునీల్ కుమార్. ముక్కుసూటితనం, సవాళ్లను స్వీకరించే ధైర్యంతో పురపాలక పీఠాన్నే అధిరోహించారు. నేడు పరకాల మున్సిపాలిటీకి సారథ్యం వహిస్తూ, కాంగ్రెస్ పరివారంలో ఒకే ఒక్కడిగా ఆయన వెలుగొందుతున్నారు. సునీల్ కుమార్ ప్రస్థానం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఎస్టీడీ బూత్ నిర్వాహకుడిగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఆయన, పట్టుదలతో వ్యాపార రంగంలో అడుగుపెట్టారు. లిక్కర్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ ఆర్థికంగా స్థిరపడ్డారు. వ్యాపారవేత్తగా రాణిస్తూనే, ప్రజా సేవపై ఉన్న మక్కువతో ఖద్దరు చొక్కా ధరించి రాజకీయ రణక్షేత్రంలోకి ప్రవేశించారు. రాజకీయ దిగ్గజం, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, నమ్మిన బంటుగా సునీల్ కుమార్ గుర్తింపు పొందారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా వెనకడుగు వేయకుండా, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అధిష్టానం మెప్పు పొందారు. ఆ నమ్మకమే ఆయనను నేడు మున్సిపల్ చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టింది.

ప్రత్యేక కథనం 2లో..

## వన్నాల విజయ లక్ష్మికి ఘన నివాళి

- ప్రథమ వర్ధంతికి పలువురు ప్రముఖుల హాజరు

8లో..






## సమానత్వం సాకారానికి 'సంత్' కృషి

- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- బంజారా మహిళలతో కలిసి నృత్యం చేసిన మంత్రి

8లో..







- ఎస్టీడీ బూత్ నుంచి మున్సిపల్ పీఠం వరకు
- ఆసక్తికరంగా రాజకీయ ప్రస్థానం
- పరకాల మోడల్ మున్సిపాలిటీనే ఆయన లక్ష్యం
- టీమ్ వర్క్‌తో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే రేవూరి సహకారంతో ముందుకు

గడ్డం కేశవమూర్తి
Cell:9390101862



# పవరున్నోడు

# పావుశెట్టి సునీల్ కుమార్





**ఎవరికీ తలవంచని మనస్తత్వం, ఉన్నది ఉన్నట్లు మాట్లాడే గుణం సునీల్ కుమార్ ప్రత్యేకత. ఒకవైపు ఆధునిక పాలనతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే, మరోవైపు భారతీయ సంప్రదాయాలను, సంస్కృతిని గౌరవించే వ్యక్తిగా ఆయన ప్రజల మనసు గెలుచుకున్నారు. వ్యాపార మెళకువలను రాజకీయాల్లో మేళవిస్తూ, పరకాల పురపాలికను ఒక మోడల్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. అనతి కాలంలోనే తనదైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్న పావుశెట్టి సునీల్ కుమార్, భవిష్యత్తులో పరకాల రాజకీయాల్లో మరింత కీలక పాత్ర పోషించనున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.**

హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో 1975 నవంబర్ 12న పావుశెట్టి లక్ష్మి-వెంకటనారాయణ దంపతులకు సునీల్ కుమార్ జన్మించారు. మొత్తం ఐదుగురు సంతానంలో ఈయన మూడో వాడు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు పరకాల పట్టణంలోని మినర్వా స్కూల్లో చదివారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్లో అభ్యసించారు. అనంతరం వరంగల్ సీకేఎం కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 2001 ఫిబ్రవరి 4న మద్దూరు మండల కేంద్రానికి చెందిన సంధ్యను వివాహం చేసుకున్నారు. వీరికి అమిత్, ప్రణీత్ ఇద్దరు కుమారులు. వీరు ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు.

## వ్యాపారంలో మోనార్క్..

చిన్నతనం నుంచే సునీల్ కు వ్యాపారాల పట్ల మక్కువ ఎక్కువగా ఉండేది. ఫార్మాస్యూటికల్ కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్ గా పనిచేసే అవకాశం వచ్చినా, సొంతంగా వ్యాపారం చేయడానికే ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. తొలుత పరకాల బస్టాండ్ ఆవరణలో కొన్నేళ్ల పాటు ఎస్టీడీ బూత్ నిర్వహించారు. అనంతరం పరకాలలో లక్ష్మీనరసింహ బ్రాండీ షాప్ పేరిట లిక్కర్ వ్యాపారం చేస్తూనే, రేగొండలో ఫంక్షన్ హాల్, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. అంతేగాక, గత పుష్కర కాలంగా రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో రాణిస్తూ అంచలంచెలుగా ఎదిగారు. పరకాల నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వరకు ఆయన వ్యాపారాలను విస్తరించారు. గత రెండు దశాబ్దాలుగా ఆయన ఏ వ్యాపారం చేసినా పట్టిందల్లా బంగారం అయింది. ఐదు పదుల వయసులోనే సునీల్ ఆర్థికంగా ఎంతో వృద్ధి చెందారు.


## రాజకీయ ప్రస్థానం..

పరకాల గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా గతంలో ఓడిన పావుశెట్టి సునీల్ కుమార్ ప్రస్తుతం మున్సిపాలిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టే వరకు ఆయన రాజకీయ ప్రస్థానం ఆసక్తికరంగా సాగింది. రకరకాల వ్యాపారాలు చేస్తూనే రెండుసార్లు పరకాల గ్రామపంచాయతీలో వార్డు సభ్యుడిగా పోటీ చేశారు. అందులో మొదటిసారి ఓడిపోయి, రెండోసారి గెలిచారు. 2026 ఫిబ్రవరి 11న జరిగిన పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్ గా 7వ వార్డ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు దుంపేటి నాగరాజు, జయంత్ లాల్ పై 173 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అంతేగాక, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆశీస్సులతో పరకాల మున్సిపాలిటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డు సభ్యుల స్థానాలకు గాను కాంగ్రెస్ 13 స్థానాలు గెలుపొందడంతో సునీల్ ఎన్నిక సునాయాసమైంది. 2026 ఫిబ్రవరి 16న పావుశెట్టి సునీల్ పరకాల మున్సిపాలిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా కొలువుదీరిన చైర్మన్ పై పుర పౌరులు కోటి ఆశలు పెట్టుకున్నారు. వీరి సారథ్యంలో అయినా తమ ప్రాంతాల అభివృద్ధి చెందుతాయని, మౌలిక సదుపాయాలు సమకూరుతాయని భావిస్తున్నారు.



## నిస్వార్థంగా సేవలందిస్తా..

పరకాల పట్టణ జనహృదయాలను చూరగొన్న తాను నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తానని చైర్మన్ పావుశెట్టి సునీల్ తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీం వర్క్ తో కష్టపడి పట్టణంలో అభివృద్ధి పనులు చేసి తన సమర్థతను చాటుకుంటానన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మిగతా కౌన్సిలర్ల సహకారంతో పరకాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలను రూపొందించుకొని ముందుకెళ్తామన్నారు. పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే.. సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మించేలా చొరవ తీసుకుంటానన్నారు. ముఖ్యంగా విలీన రాజుపేట, సీతారాంపురం గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక శ్రద్ధ పెడతానని హామీ ఇచ్చారు. అందరి సహకారంతో ప్రజల ఇబ్బందులను తొలగిస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు ఉన్న నమ్మకం ఫలితమే ఈ మున్సిపల్ ఎన్నికల విజయమని సునీల్ తెలిపారు. కాంగ్రెస్ కేవలం గ్రామీణ పార్టీయేనని, పట్టణాల్లో లేదని బురద చల్లిన వారికి ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు లాంటివన్నారు. ఈ విజయం అందించిన ప్రతి ఓటర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రగతి ప్రదాత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో సమిష్టిగా పనిచేస్తూ ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని సమదృష్టితో ముందుకు తీసుకువెళ్లి ప్రగతి బాట పట్టించడం వల్లే తన గెలుపు సునాయాసమైందన్నారు. రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న ఎమ్మెల్యే నాయకత్వంలో పరకాల పట్టణాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తానని చైర్మన్ పావుశెట్టి సునీల్ స్పష్టం చేశారు.







# పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణం నా అదృష్టం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ. 28 కోట్లతో నూతన భవనాల నిర్మాణం
- మున్నూరు కాపు భవన పనుల పరిశీలన
- నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో ప్రారంభమైన చారిత్రక హనుమకొండ పాలిటెక్నిక్ కళాశాల, నేడు తన హయాంలో రూ.28 కోట్ల నిధులతో ఆధునీకరణకు నోచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం 11వ డివిజన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల, మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ కూడా నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. గత వర్షాలకు బాలికల గదుల్లోకి నీరు చేరిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులతో ఎమ్మెల్యే ముచ్చటించారు. నేటి సమాజంలో స్త్రీ పురుష విభేదాలు లేవని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పనులు వేగంగా జరుగుతుండటంపై అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మున్నూరు కాపు భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, గ్రౌండ్ లెవల్ పనులు పూర్తయిన నేపథ్యంలో.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ పిట్టల శ్రీనివాస్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, దేవరకొండ సురేందర్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి.శ్రీనివాస్ రావు, మున్నూరు కాపు నాయకులు కటకం పెంటయ్య, గైనేని రాజన్, రవి కుమార్, నాయకులు కుమార్ యాదవ్, సంగీత్, అక్షయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో ప్రతి ఆర్టీసీ బస్సు ఆగాలి

## డీఎం ప్రసూనా లక్ష్మికి వినతిపత్రం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట పట్టణ పరిధిలోకి విలీనమైన మహేశ్వరం గ్రామంలో ప్రతి ఆర్టీసీ బస్సు నిలపాలని కోరుతూ గ్రామస్తులు శనివారం డిపో మేనేజర్ (డీఎం) ప్రసూనా లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామం నుంచి నిత్యం వందలాది మంది ఉద్యోగ, విద్యా, వైద్య అవసరాల నిమిత్తం హనుమకొండ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తుంటారని తెలిపారు. అయితే, మెజారిటీ బస్సులు మహేశ్వరం వద్ద ఆగకుండా వెళ్తుండటంతో, ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో నర్సంపేట వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో హనుమకొండ నుంచి వచ్చే బస్సులు మహేశ్వరం వద్ద ఆపకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల విన్నపంపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు. సమస్యను పరిష్కరించి, మహేశ్వరం వద్ద అన్ని బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు మాత్రు రాథోడ్, భూస శిరీష–రాజు, గ్రామస్తులు చెన్న భాస్కర్, బేతం అఖిల్, చిదురాల చక్రపాణి, మోర్తాల రాజు, బొల్ల శ్రీకాంత్, చెన్న గణేష్, చేరాల ప్రదీప్, భూక్య సాయి కళ్యాణ్ పాల్గొన్నారు.

# బాధితులకు ధైర్యం చెప్పిన మాజీ జడ్పీటీసీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో శనివారం మండల ప్రథమ జడ్పీటీసీ సభ్యులు, సీనియర్ రాజకీయ నాయకులు మేడిశెట్టి రాములు పర్యటించి పలువురిని పరామర్శించారు. ఇటీవల తురకల సోమవారం వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి, ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బంధారపు రంజిత్‌ను రాములు సందర్శించారు. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. అనంతరం ఇటీవల మరణించిన అల్వాల వీరస్వామి మాతృమూర్తి కుటుంబ సభ్యులను మేడిశెట్టి రాములు పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఈ పరామర్శలో నాయకులు గోనే సంపత్, సందెల నవీన్, మహమ్మద్ సర్వర్, కంటేం ఏకాంతం, కాంటెస్టెడ్ సర్పంచ్ సింగార రమేష్, డాక్టర్ శ్రీనివాస్, కొండ వెంకన్న, బోట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందిరమ్మ ఇల్లు' గృహప్రవేశం



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మండల పరిధిలోని ములకలపల్లి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ఇల్లు పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. శనివారం గ్రామంలోని ఓనపాకల రోజా–బద్రీనాథ్ దంపతుల నూతన గృహప్రవేశం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మొగుళ్లపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ నీల రాజు ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో మొట్టమొదటి గృహప్రవేశానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన మిగతా లబ్ధిదారులు కూడా పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని రాజు సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం సకాలంలో అందేలా కృషి చేస్తామన్నారు. లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అమ్మ భాషను మరువద్దు

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నతల్లి లాంటి మాతృభాషను విస్మరించకూడదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్కలగుట్ట శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శనివారం బాలసముద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు మాతృభాషలోని మాధుర్యాన్ని ఆస్వాదించాలని, తెలుగు ఇతిహాసాలను చదివి మన సంస్కృతిని తెలుసుకోవాలని సూచించారు. ఆధునిక కాలంలో ఇతర భాషలపై పట్టు సాధించినప్పటికీ, మన మూలాలను మర్చిపోవద్దని కోరారు. అనంతరం విజేతలకు మెడల్స్ ప్రదానం చేసి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఆర్.ఐ మనోహర్, జోనల్ కోఆర్డినేటర్ జి. శివ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సీమ, డీన్ సుప్రియ, ఇన్చార్జి అనిత, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, రక్షిత, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర పరిశోధనలే భవిష్యత్తుకు బలమైన పునాది

- రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం
- కేయూలో '9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్'



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** చరిత్ర అనేది కేవలం గతాన్ని నమోదు చేసే ప్రక్రియ మాత్రమే కాదని, వాస్తవ ఆధారాలతో కూడిన పరిశోధనల ద్వారానే భవిష్యత్తుకు బలమైన పునాది వేయగలమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. శనివారం కేయూ సెనేట్ హాల్‌లో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యులు, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య ఈ.సుధారాణి అధ్యక్షతన ప్రారంభమైన "9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్" సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. వరంగల్ నగరం తెలంగాణ చారిత్రక వైభవానికి నిలువెత్తు సాక్ష్యమని కొనియాడారు. కాకతీయుల కళాసంపద నుంచి ఆధునిక సామాజిక ఉద్యమాల వరకు ఈ నేల చరిత్ర విశిష్టమైనదని పేర్కొన్నారు. 1956 నుంచి రాష్ట్ర చరిత్ర, రైతాంగ పోరాటాలు, సామాజిక సంస్కరణలపై తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ చేస్తున్న శాస్త్రీయ అధ్యయనాన్ని ఆయన అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య బి.సురేష్ లాల్ మాట్లాడుతూ.. "ఆరంజ్ ఎకానమీ" ద్వారా సంస్కృతి, విలువల వ్యవస్థల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన సమాజాల చరిత్రలను వెలికితీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సదస్సులో భాగంగా అతిథుల చేతుల మీదుగా "తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8వ వార్షిక సమావేశాల నివేదిక"ను ఆవిష్కరించారు. ఈ సంస్థకు ప్రస్తుతం 400 మందికి పైగా శాశ్వత సభ్యులు ఉన్నారని, యువ పరిశోధకులు పరిశోధనలపై మరింత దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి అంకం జయప్రకాశ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య జి.వెంకటరాజం, మాజీ అధ్యక్షులు ఆచార్య జి.సుదర్శన్ రెడ్డి, ఆచార్యులు జి.దయాకర్, పాండ్య భుక్య, సిక్కిం యూనివర్సిటీ ఆచార్యులు జి.విజయకుమార్, టి.దయాకర్ రావు, రాజశేఖర్ బాబు, వదన్నం, లావణ్య, బండి శ్రీనివాస్, టి.మనోహర్, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో భాగంగా మూడు స్మారక ఉపన్యాసాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కూనాటి అనిల్ రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనిల్ రెడ్డి పార్థీవ దేహాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనిల్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు భరోసా ఇచ్చారు. మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, ఫిబ్రవరి 21, 2026

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, చిల్పూర్/స్టేషన్ ఘనపూర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను వాస్తవ రూపంలోకి తెస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శనివారం చిల్పూర్ మండలం శ్రీపతిపల్లి గ్రామంలో పూర్తయిన 'ఇందిరమ్మ ఇల్లు' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించిన అనంతరం, ఇంటి నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 85 శాతం నిర్మాణాలు ప్రారంభమై ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3,500 ఇళ్లు మంజూరు కానున్నాయని ఆయన శుభవార్త చెప్పారు.ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో నెంబర్ 96 గురించి వివరిస్తూ.. గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై అసంపూర్తిగా ఉన్న వారికి కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. బేస్‌మెంట్ లెవల్ వరకు కట్టుకున్న వారికి రూ.4 లక్షలు, రూఫ్ లెవల్ వరకు నిర్మాణం అయిన వారికి రూ.3 లక్షలు ఈ వెసులుబాటు ద్వారా పాత ఇళ్లను కూడా పూర్తి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. రానున్న మూడేళ్లలో నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ 40వ డివిజన్ పరిధిలో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చుతోందని, ప్రజలు, విద్యార్థులు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారని కార్పొరేటర్ మరుపల్ల రవి ఆవేదన వ్యక్తం చేశారు. కరీమాబాద్ వాటర్ ట్యాంక్ సమీపంలో నివసిస్తున్న బిల్లా పుష్ప అనే మహిళపై కోతులు దాడికి ప్రయత్నించగా, తప్పించుకునే క్రమంలో ఆమె కిందపడి మోకాలి చిప్ప పగిలి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పుష్పను కార్పొరేటర్ పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయని తెలిపారు. రోడ్లపైనే కోతులు తిష్ట వేయడంతో ప్రజలు రహదారిపై నడవలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఇళ్లపైనే నిద్రపోతున్న కోతులు, పగటిపూట ఇళ్లలోకి చొరబడి నిత్యావసర వస్తువులను, ఆహార పదార్థాలను ఎత్తుకుపోతూ భయాందోళనకు గురిచేస్తున్నాయని వివరించారు. కోతుల దాడుల వల్ల జరుగుతున్న ప్రమాదాలను వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సీఎంహెచ్ఓ, ఎంహెచ్ఓల దృష్టికి తీసుకెళ్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి డివిజన్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జవాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ లక్ష్యమా?



**వరంగల్ వాయిస్, పరకాల :** దేశ అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం అడ్డంకులు సృష్టిస్తోందని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ తీవ్రంగా ఆరోపించారు. శనివారం ఆయన పరకాలలో మీడియాతో మాట్లాడుతూ.. దేశాభివృద్ధి పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 'ఇండియా–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించిన వైఖరిని నిరంజన్ తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిభను, సాంకేతిక శక్తిని చాటాల్సిన సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టించడం దేశ ప్రతిష్టకు భంగం కలిగించడమేనని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌లు జాతీయ సమైక్యతను చాటాలి కానీ, ఇలాంటి చర్యలు ఆ లక్ష్యానికి విరుద్ధమని మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకోవడం కాంగ్రెస్ నైజమని విమర్శిస్తూ.. ఇకనైనా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేసి, అభివృద్ధికి సహకరించాలని నిరంజన్ పిలుపునిచ్చారు.

# పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, దామెర :** మండల పరిధిలోని ఊరుగొండ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన కూనాటి అనిల్ రెడ్డి (43) అనే రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ రెడ్డి గత కొంతకాలంగా వ్యవసాయ పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం భార్య సరితతో గొడవ జరిగింది. అనంతరం భార్య ఇంట్లో లేని సమయం చూసి అనిల్ రెడ్డి క్షణికావేశంలో పురుగుల మందు సేవించారు. అపస్మారక స్థితిలో ఉన్న అనిల్ రెడ్డిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు దామెర ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# బీసీల్లో పెరిగిన రాజకీయ చైతన్యం

## 'మెపా' జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల విజేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో బీసీలు రాజకీయంగా చైతన్యవంతులవుతున్నారని, రానున్న ఎన్నికల్లోనూ ఇదే ఐక్యతను చాటాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల విజేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు అధికారికంగా 17.33 శాతం రిజర్వేషన్లు ప్రకటించినప్పటికీ, బీసీ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా 52 శాతం స్థానాల్లో విజయం సాధించడం వారి సత్తాకు నిదర్శనమని విజేందర్ పేర్కొన్నారు. అదేవిధంగా మున్సిపల్ ఎన్నికల్లో 62 శాతం మంది బీసీలు గెలవడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీసీ ఓటర్ల చైతన్యం ఏపాటిదో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైందని వివరించారు. జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు తగిన వాటా దక్కాలనే లక్ష్యంతో 'మేమెంతో.. మాకంత' నినాదంతో మెపా సంస్థ శాంతియుతంగా పోరాడుతోందని తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీల చైతన్యం కేవలం గత ఎన్నికలకే పరిమితం కాకూడదని, రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బీసీలు ఏకతాటిపై నిలిచి తమ రాజకీయ సత్తాను చాటాలని ఆయన కోరారు. సామాజిక న్యాయం జరగాలంటే బీసీలు మరింతగా వ్యవస్థీకృతం కావాలని విజేందర్ ముదిరాజ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఘనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా గృహప్రవేశం

## గంటా రవికుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ శనివారం నిర్వహించిన నూతన గృహప్రవేశ మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటా రవికుమార్ దంపతులకు డాక్టర్ కాళీ ప్రసాద్ రావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో వారు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల మధ్య ఆధ్యాత్మిక శోభతో, ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంతి లాల్, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో విద్యార్థుల పరవశం..

- 'వనదర్శిని'తో పర్యావరణ పాఠాలు
- దేవునూర్ ఇనుపరాతి గట్లపై ట్రెక్కింగ్
- ఫారెస్ట్ బాతింగ్ తో మానసిక ఉల్లాసం




**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** తరగతి గది పాఠాలకు భిన్నంగా, ప్రకృతి ఒడిలో అటవీ సంపదపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ అటవీ శాఖ నిర్వహించిన 'వనదర్శిని' కార్యక్రమం విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. మండలంలోని దేవునూర్ ఇనుపరాతి గట్ల వద్ద నిర్వహించిన ఈ ట్రెక్కింగ్ మరియు ఫారెస్ట్ వాక్ కార్యక్రమంలో ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ (బాలురు), ఎంపీపీఎస్ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ఉపసమితి కన్వీనర్ ధర్మప్రకాశ్ విద్యార్థులకు "ఫారెస్ట్ బాతింగ్" అనే సరికొత్త భావనను పరిచయం చేశారు. అడవిలోని ప్రశాంతతను, శబ్దాలను, స్వచ్ఛమైన గాలిని అనుభూతి చెందడం వల్ల కలిగే మానసిక, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ప్రకృతితో మమేకమవ్వడం వల్ల ఒత్తిడి తగ్గి, సృజనాత్మకత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రెక్కింగ్ సందర్భంగా విద్యార్థులు అడవిలోని వృక్షజాలం, పక్షులు, కీటకాలను ఆసక్తిగా పరిశీలించారు. పర్యావరణ సమతుల్యతలో అడవుల పాత్ర, జలవనరుల సంరక్షణ, వన్యప్రాణి రక్షణపై ధర్మప్రకాశ్ అవగాహన కల్పించారు. అటవీ అధికారులు రతన్ లాల్, అశోక్, రాణి విద్యార్థులకు చెక్ డ్యామ్‌ల నిర్మాణం, అటవీ రక్షణ చట్టాల గురించి వివరించారు. ప్రకృతి పట్ల గౌరవాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, సుధీర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ

- హాజరైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- ఆలయ అభివృద్ధికి రూ.12.15 కోట్ల నిధులు
- భక్తులను పరవశింపజేసిన చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి (కొడవటంచ) :** మంచి చేసే వారికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో స్పీకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. కొడవటంచ దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 12.15 కోట్ల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. భక్తులకు మరిన్ని మెరుగైన



సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరిన విధంగా మరిన్ని అదనపు నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు స్పీకర్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆలయ పునః ప్రతిష్ఠలో భాగంగా వేద పండితులు సంప్రోక్షణ, యాగశాల క్రతువులు, కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి అందించిన ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ దేవాలయం పునః ప్రతిష్ఠ జరగడం శుభసూచకమని హర్షం వ్యక్తం చేశారు. ఈ మహోత్తర కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్ సంపత్ రావు, ఈఓ మహేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కమ్మనైన అమ్మ భాషను కాపాడుకుందాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పరభాషల మోజులో పడి కన్నతల్లి లాంటి మాతృభాషను విస్మరించవద్దని మాతృభాష పరిరక్షణ సమితి అధ్యక్షులు, శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. వరంగల్ జిల్లా 14వ డివిజన్ మణికంఠ కాలనీలోని పాఠశాల ప్రాంగణంలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. 1999లో యునెస్కో ప్రకటించిన నాటి నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. తెలుగు భాషా మాధుర్యాన్ని, తెలుగు కవుల గొప్పతనాన్ని, వారు భాషా వికాసానికి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవాలంటే మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మాతృభాషపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 'అనర్గళంగా తెలుగులో మాట్లాడడం' అనే అంశంపై ఉపన్యాస, పద్య పఠన మరియు కథల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ఆలపించిన పద్యాలు, చెప్పిన కథలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఉపాధ్యాయినీలు ఎస్.స్వాతి, ఎం.రాధా, రిజ్వానా, ఫాతిమా, శ్రావణి, లత శ్రీ, చందన, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో బతకాలని, వారి ఆర్థిక పునరావాసం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. శనివారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి కే.కోదండ రాములు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, జనగామ జిల్లాకు చెందిన ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి నిమిత్తం చెక్కులను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.75,000 చొప్పున మొత్తం రూ. 2,25,000 విలువైన చెక్కులను 100 శాతం సబ్సిడీతో కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ నిధులతో వారు చిన్న తరహా వ్యాపారాలు లేదా స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మాతృభాష మృతభాష కాకూడదు.. అమృత భాష కావాలి

**వరంగల్ వాయిస్, నడికూడ :** మాతృభాష అనేది కేవలం భావవ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదని, అది మన సంస్కృతికి ప్రతిబింబమని, మాతృభాష మృతభాష కాకుండా అమృత భాషగా వెలగాలని తెలుగు భాషోపాధ్యాయులు పల్లె శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ, భాషా సాంస్కృతిక భిన్నత్వాన్ని గుర్తించేందుకు యునెస్కో 1999లో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్న, పెద్ద భాషలన్నింటినీ రక్షించుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని పేర్కొన్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్న పల్లె శ్రీనివాస్‌ను ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మరియు ఉపాధ్యాయ



బృందం శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. మాతృభాష పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవ, కంచ రాజకుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ భీముడి లక్ష్మి, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ ప్రతిష్టను దెబ్బతీయడమే కాంగ్రెస్ లక్ష్యమా?

## ప్రపంచ ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరుపై జడ సతీష్ ధ్వజం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ప్రపంచ దేశాల ముందు భారతదేశ ప్రతిష్టను దిగజార్చే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా నాయకులు జడ సతీష్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన వర్ధన్నపేటలో ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ ఏఐ సదస్సులో కాంగ్రెస్ యూత్ నాయకులు వ్యవహరించిన తీరును హాస్యాస్పదమని కొట్టిపారేశారు. వంద దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు పాల్గొన్న ప్రతిష్టాత్మక సదస్సులో భారత ప్రధానిని వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్ ఏం సాధించారని సతీష్ ఎద్దేవా చేశారు. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను ఏఐ హబ్‌గా మారుస్తామంటుంటే, మరోవైపు తెలంగాణకు చెందిన యూత్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఈ దాడుల్లో పాల్గొనడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. భూ కబ్జాల గురించి ప్రశ్నించిన ఎమ్మెల్యేపై దాడి చేయడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారు పదవిలో ఉండి షబ్బీర్ అలీ ఇలాంటి పనులు చేయించడం సిగ్గుచేటని అన్నారు. బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించినా దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ నైజమని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి, జాతీయ రహదారుల దిగ్బంధం వంటి నిరసనలకు వెనుకాడబోమని హెచ్చరించారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తున్నామని, దాన్ని బలహీనతగా భావిస్తే తగిన గుణపాఠం చెబుతామని జడ సతీష్ హెచ్చరించారు.

# మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- మహిళా కమ్యూనిటీ భవనం ప్రారంభం
- మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం



**వరంగల్ వాయిస్, నర్సంపేట/ఖానాపురం :** రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని, మహిళా సంఘాలు ఈ పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామంలో ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన మహిళా కమ్యూనిటీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సభా ప్రాంగణంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.1లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. మొదటి ఏడాదే లక్ష్యానికి మించి రూ. 21,600 కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేశామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లు, కోళ్ల పెంపకం, మిల్క్ డెయిరీల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు 150 బస్సులు ఇచ్చి ఆర్టీసీతో ఒప్పందం కుదిర్చామని, పెట్రోల్ బంకులకు యాజమాన్యులను చేశామని గుర్తుచేశారు. విద్యార్థుల స్కూల్ డ్రెస్సులు కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల మరియు గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరకాలలో 'కృషి విజ్ఞాన కేంద్రం' ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్యే రేవూరికి వినతిపత్రం అందజేత



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల డివిజన్ కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ.. పరకాల డివిజన్ పరిధిలోని నడికూడ తదితర మండలాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ ప్రాంత రైతులు పంటలకు సంబంధించిన చిన్న సమస్య వచ్చినా, సాంకేతిక సూచనల కోసమైనా వరంగల్‌లోని ఆర్ఏఆర్ఎస్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరకాలలోనే కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు తక్షణ సాంకేతిక సహాయం, కొత్త రకం పంటలపై శిక్షణ, సమస్యల పరిష్కారం సులభంగా లభిస్తాయని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాకు కేటాయించిన ఈ కేంద్రాన్ని పరకాల డివిజన్‌లోనే ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి నాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# 'తెలంగాణ గాంధీ' భూపతి కృష్ణమూర్తికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి 'తెలంగాణ గాంధీ'గా పేరుగాంచిన స్వర్గీయ భూపతి కృష్ణమూర్తి శతాబ్ది జయంతి వేడుకలను శనివారం వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ వరంగల్ సెంట్రల్ ఇంచార్జి ప్రెసిడెంట్ దివ్వెల పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉదయం వరంగల్ కృష్ణా కాలనీలోని కోదండరామ నిలయంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో భూపతి కృష్ణమూర్తి చేసిన సేవలను పలువురు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన పడిన తపన, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. వారితో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా అభిమానులు గుర్తుచేసుకున్నారు. జయంతి వేడుకల సందర్భంగా వాసవి క్లబ్ సెంట్రల్ మరియు అగర్వాల్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా రోగులకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. అనంతరం పేదలకు, బాటసారులకు అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్.సి అనంతుల కుమారస్వామి, సెక్రెటరీ చెల్పూరు హేముచందర్, కోశాధికారి కల్వ రాజ్ కుమార్, సభ్యులు చిట్టిమల్ల అరుణ్, శ్రీరాం శివాజీ, భూపతి పూర్ణ, త్రోవగుంట వెంకటరమణ, ఏకాంబరం, కిరణ్, ప్రవీణ్, నాగవేణి, అక్షయ, రాధిక, అపర్ణ, శిరీష, అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది ఎన్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ ఆశయాలను కొనసాగిద్దాం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** పీడిత వర్గాల సమానత్వం కోసం, బంజారాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు కొనియాడారు. శనివారం మండలంలోని రోళ్ళకల్ చెరువుముందు తండాలో నిర్వహించిన సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తండాకు చేరుకున్న ఎమ్మెల్యేకు బంజారా సోదరులు సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి, శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన సోదరీమణులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు ఉత్సాహంగా నృత్యం చేసి వారిలో జోష్ నింపారు. అనంతరం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇందిరాగాంధీ గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చి వారికి అండగా నిలిచారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో గిరిజన సోదరుల పాత్ర కీలకమని, తన గెలుపులోనూ తండాల ప్రజలు చూపిన ఆదరణ మరువలేనిదని పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు చాటిచెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆలయ నిర్మాణం కోసం భూమిని, నిధులను అందజేసిన దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గిరిజన సమస్యల పరిష్కారానికి, వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు తాను అనునిత్యం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పర్వతగిరి మండలానికి చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దేవి మంగ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, సర్పంచులు తొర్రి పద్మ, గాడుదల రవి, స్థానిక నాయకులు, గిరిజన సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవాలాల్ మార్గమే మన మార్గం కావాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు
- బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీక సేవాలాల్ మహారాజ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప తాత్వికవేత్త, సామాజిక సంస్కర్త అని, ఆయన చూపిన మార్గం సమాజానికి దిక్సూచి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా గిరిజన భవన్‌లో శనివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముందుగా కొబ్బరికాయ కొట్టి, స్వామివారికి నైవేద్యం సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. గోర్ బంజారా జాతి ఐక్యత కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. నాటి హైదరాబాద్ రాజ్యంలో బంజారాల వర్తక వ్యాపారాలకు స్వేచ్ఛ కల్పించాలని, పశువుల మేతకు అడ్డంకులు లేకుండా జీవించే హక్కు కల్పించాలని ఆయన పోరాడారని గుర్తు చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకే నిజాం రాజు నాటి బంజారా హిల్స్ ప్రాంతాన్ని ఇనాంగా ఇచ్చి, గిరిజనులకు స్వేచ్ఛా హక్కులు కల్పించారని వివరించారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. గిరిజన బిడ్డలు సేవాలాల్ మహారాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, జిల్లా అభివృద్ధి అధికారి ప్రేమలత, నాయకులు వీఎన్.నాయక్, జై సింగ్ రాథోడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు బంక సతీష్, గిరిజన సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వృద్ధాప్యం అనేది జీవితంలో ఒక దశ మాత్రమేనని, అది ఎవరికీ శాపంగా మారకూడదని సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హనుమకొండ ఆధ్వర్యంలో కాజీపేటలోని సహృదయ వృద్ధాశ్రమంలో శనివారం 'ఉచిత న్యాయ సహాయం – ఆత్మీయ స్పర్శ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై వృద్ధుల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులను పోషించాల్సిన కనీస బాధ్యత పిల్లలదేనని, ఆ బాధ్యతను విస్మరించి వారిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ఉన్న ట్రిబ్యునల్ బెంచ్ ఒక వరం లాంటిదని, వేధింపులు ఎదుర్కొంటున్న వృద్ధులు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఎంతటి కోటీశ్వరులైనా కన్నవారిని గౌరవించని వారు దరిద్రులతో సమానమని ఆమె వ్యాఖ్యానించారు. వృద్ధులకు ఎదురయ్యే ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులకైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుంచి ఉచితంగా సహాయం అందిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. పారా లీగల్ వలంటీర్లు ఎల్లప్పుడూ ఆశ్రమంలోని వారికి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆశ్రమ వాసులను ఆత్మీయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను ప్రేమించడం, గౌరవించడం మన సంస్కారానికి నిదర్శనమని, ప్రతి ఒక్కరూ వయోవృద్ధుల పట్ల కరుణతో వ్యవహరించాలని కోరారు. న్యాయపరమైన అవసరాల కోసం ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించవచ్చని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు యాకూబి, పారా లీగల్ వాలంటీర్ ఉపేందర్, డాక్టర్ ఉష, న్యాయవాదులు రవి, సుభాష్, పద్మ, స్రవణ్, అతీఫ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# భార్యపై ప్రేమను చాటుకున్న నిక్ జోనస్

తన భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న 'ద బ్లఫ్' సినిమాలోని 'బ్లడీ మేరీ' పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్లెట్‌గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు. పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. చాలామంది పురుషులు పెళ్లి ఉంగరాలను కూడా పెట్టుకోవడానికి ఇష్టపడని ఈ రోజుల్లో, నిక్ జోనస్ తన భార్య దేశపు సంప్రదాయాన్ని తన మణికట్టుపై ధరించడం విశేషం. ఇది కేవలం స్టైల్ కోసం చేసిన ప్రయత్నం కాదు, తన భార్య నమ్మకాల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనం. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అనే భావనను ఆయన ఈ చిన్న చర్య ద్వారా చాటిచెప్పారు. నిక్ జోనస్ ప్రభావంతో ఇప్పుడు పురుషుల మంగళసూత్ర బ్రాస్లెట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని ప్రముఖ జ్యూవెలరీ డిజైనర్లు చెబుతున్నారు. చాలామంది పురుషులు ఇప్పుడు తమ సంబంధాల్లో సమానత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే ఇలాంటి ఆభరణాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారని 'డిఐ డిజైన్స' ఫౌండర్ దిశా షా పేర్కొన్నారు. లోకమంతా టెక్నాలజీ, ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా.. తమ మూలాలను, ఎదుటివారి సంస్కృతిని గౌరవించడమే నిజమైన ప్రేమ అని నిక్ జోనస్ నిరూపించారు. కేవలం సినిమా ప్రమోషన్ కోసం కాకుండా, మనసు నిండా ఉన్న ప్రేమతో ఆయన చేసిన ఈ పనికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. పెళ్లి ఉంగరాలను ఇంట్లో మర్చిపోయే భర్తల కంటే, ఇలా భార్య సంస్కృతిని సొంతం చేసుకునే నిక్ జోనస్ లాంటి భర్తలు కావాలంటూ మహిళలు కామెంట్స్ చేస్తున్నారు.

# స్టార్ హీరోహీరోయిన్లకు మించిన క్రేజ్

ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్ తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్దతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్దతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది. ఈ సీరియల్ ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సీరియల్ విజయవంతంగా దూసుకుపోతుంది. ఇక ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో గ్లామర్ లుక్స్ తో హీటెక్కిస్తుంది. ఇదిలా ఉంటే.. అమూల్య గౌడ ఒక్క ఎపిసోడ్ కోసం రూ.30 నుంచి రూ.35 వేలు తీసుకుంటుందట.





# అల్లు అర్జున్ ప్రైవేట్ పార్టీలో రామ్ చరణ్-ఉపాసన

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చాలా నెలల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో మెరిశారు. అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ లో భాగంగా బన్నీ ఏర్పాటు చేసిన ప్రైవేట్ పార్టీలో రామ్ చరణ్ ఉపాసన దంపతులు సందడి చేశారు. కాబోయే వధూవరులు అల్లు శిరీష్ – నయనికలతో బన్నీ – చెర్రీ కలిసి దిగిన ఓ పిక్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ 'మెగా – అల్లు' కలయిక అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.అల్లువారబ్బాయి శిరీష్ మరికొన్ని రోజుల్లో ఓ ఇంటివాడు కాబోతున్న సంగతి తెలిసిందే. ప్రేయసి నయనికతో ఏడడుగులు వేయబోతున్నాడు. ఇప్పటికే అల్లు ఫ్యామిలీలో పెళ్లి సందడి మొదలైపోయింది. ఇటీవల అల్లు సోదరులు దుబాయ్ లో గ్రాండ్ గా పార్టీ నిర్వహించారు. హైదరాబాద్ లోని అల్లు వారి నివాసంలో పసుపు దంచే కార్యక్రమంతో పెళ్లి పనులు మొదలుపెట్టారు. తమ్ముడు వివాహం సందర్భంగా అల్లు అర్జున్ తాజాగా ఓ ప్రైవేట్ పార్టీ ఏర్పాటు చేయగా.. దానికి రామ్ చరణ్ హాజరవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. మరికొన్ని రోజుల్లో అల్లు శిరీష్ పెళ్లి పీటలు ఎక్కబోతున్న నేపథ్యంలో, అల్లు అర్జున్ తన ఫామ్ హౌస్ లో శుక్రవారం రాత్రి గ్రాండ్ ప్రీవెడ్డింగ్ పార్టీ నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఇండస్ట్రీలోని అత్యంత సన్నిహితులు ఈ పార్టీకి అటెండ్ అయ్యారని తెలుస్తోంది. ఈ వేడుకకు రామ్ చరణ్ తన భార్య ఉపాసనతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్, రామ్ చరణ్ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకోవడమే కాకుండా, కలిసి ఫోటోలకు పోజులిచ్చారు. కాబోయే వధూవరులు అల్లు శిరీష్ – నయనికలతో అల్లు అర్జున్ – స్నేహా రెడ్డి, రామ్ చరణ్ – ఉపాసన దంపతులు కలిసి ఫోటో దిగారు. ఈ పిక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో అల్లు – మెగా ఫ్యామిలీ మెంబెర్స్ బ్లాక్ డ్రెస్సుల్లో మెరిశారు. దీక్షలో ఉన్న చరణ్.. చెప్పులు లేకుండా సింపుల్ గా నిలబడి ఉన్నారు. మిగతా వారు మాత్రం మోడరన్ డ్రెస్సుల్లో కనిపిస్తున్నారు. ఈ ఫోటో నెట్టింట సందడి చేస్తోంది. చాలా కాలం తర్వాత బన్నీ – చెర్రీ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తెలుగు చిత్ర పరిశ్రమలో 'మెగా' & 'అల్లు' కుటుంబాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది.

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, ఫిబ్రవరి 21, 2026



# సమానత్వం సాకారానికి 'సంత్' కృషి

- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- బంజారా మహిళలతో కలిసి నృత్యం చేసిన మంత్రి

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖ కొనియాడారు. సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని వరంగల్ పరిధి 19 వ డివిజన్ కాశీబుగ్గలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి డోలు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీటీడీఓ నారాయణ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం గురువు సంత్ సేవాలాల్ అన్నారు. ఆయనను జగదాంబ మాత అంశంగా బంజారాలు భావిస్తారన్నారు. తన జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేశారని కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువే కాదని బంజారాల జాతిని చైతన్యం చేసిన గొప్ప మహనీయుడన్నారు. ఆ కాలంలో ఉన్న మూఢనమ్మకాలను, జంతు బలులను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. జీవ హింస మహా పాపం అని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మద్యపానం ధూమపానం మనిషితో పాటుగా కుటుంబాలను నాశనం చేస్తాయని వాటిని విడనాడాలని సేవాలాల్ సూచించారన్నారు. వందల సంవత్సరాల క్రితమే మహిళలకు సమాన గౌరవం ఇవ్వాలని ప్రబోధించిన మహనీయుడు సంత్ సేవాలాల్ అన్నారు. ఆయుర్వేదం పట్ల అవగాహన ఉండడం వల్ల ప్రకృతి వైద్యంతో అనేక మందిని రోగాల నుంచి విముక్తి కలిగించారని గుర్తు చేశారు. మహిళలు, పీడిత వర్గాల సమానత్వం కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకం, ఆచరణీయమన్నారు. బంజారా బిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారి అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా బంజారా ప్రతినిధులు మంత్రి సురేఖతోపాటు మేయర్, అధికారులు, కార్పొరేటర్లు, మీడియా ప్రతినిధులను బంజారాల సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ బంజారాలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోశాల పద్మ, ఓని స్వర్ణలత భాస్కర్, వస్కుల బాబు, బాల్నే సురేష్, చింతాకుల అనిల్ కుమార్, ఆర్ డీఓ సుమ, ఏసీపీ శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా, బంజారా ప్రతినిధులు మోతీ నాయక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలకు ఆప్షన్
# పాలకవర్గంలోకి కో-ఆప్షన్

□ నూతన పాలకవర్గం ఏర్పడిన 60 రోజుల్లో నియామకం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పురపాలికల్లో కీలకపాత్ర పోషించే కో-ఆప్షన్ సభ్యుల నియమకాలు త్వరలో జరుగనున్నాయి. ఇప్పటికే పురపాలిక, కార్పోరేషన్ లలో పాలకవర్గాలు కొలువు తీరాయి. ఈ క్రమంలో తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం కో-ఆప్షన్ సభ్యులను నియమించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నూతన పాలకవర్గం ఏర్పాడిన 60 రోజల లోపు కో-ఆప్షన్ సభ్యులను నియమించాలి. ఇందుకు అనుగుణంగా కో-ఆప్షన్ సభ్యుల నియామకానికి ప్రభుత్వంతో పాటు ఆయా పార్టీల నాయకులు ముందుకు సాగుతున్నారు. నిబంధనల ప్రకారం పురపాలికల్లో అనుభవం ఉన్నవారికి సమాజంలో తగిన ప్రాధాన్యం, ఇతర వర్గాలను భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో కో-ఆప్షన్ నియామకాలు జరగనున్నాయి. నామినేటెడ్ విధానంలో పాలకవర్గాల ఎన్నిక ప్రక్రియ తర్వాత ఆయా నగర, పురపాలక వార్డులు డివిజన్ల సంఖ్య ఆధారంగా కమిషనర్ కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అర్హత కలిగిన అభ్యర్థులు నామినేషన్లను సమర్పిస్తారు. మైనార్టీ కోటా కింద పోటీ చేసేవారు తమ కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ తమ అర్హతలను వెల్లడిస్తారు.

## అర్హత.. ఎంపిక .. బాధ్యతలు..

కో ఆప్షన్ సభ్యులు కౌన్సిలర్లతో సమాన హోదా కలిగి ఉంటారు. కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక విషయంలో కొన్ని నిబంధనలున్నాయి. మొత్తం నలుగురు కో-ఆప్షన్ సభ్యులకు గాను ఇద్దరు మైనార్టీలు, మరో ఇద్దరు పరిపాలనపై అవగాహన కలిగిన మాజీ ప్రజాప్రతినిధులు, విశ్రాంత అధికారులు, ఉద్యోగులై ఉండాలి. అంటే ఇక్కడ మాజీ కార్పొరేటర్లకు ఎక్కువ అవకాశం ఉంటుంది. మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో ఇద్దరు, ముగ్గురు సభ్యులకు గాను ఇద్దరు మైనార్టీ వర్గానికి చెందిన ఇద్దరు (ఒక మహిళ, ఒక పురుషుడు) మరో ఇద్దరు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పై అవగాహన కలిగిన వారై ఉండాలి. కో-ఆప్షన సభ్యుల స్థానాలకు దరఖాస్తు చేసుకునేవారు ఆయా కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఓటరై ఉండి 21 ఏళ్లు నిండి ఉండాలి. దరఖాస్తు చేసిన వారిలో సభ్యుల ఎన్నిక కోసం మేయర్, చైర్మన్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్పొ రేషనలో కార్పొరేటర్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కౌన్సిలర్లు చేతులెత్తి కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకునేలా ఏర్పాట్లు చేయాలని పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. పాలకవర్గం ఏర్పాటైన తొలి సమావేశం నుంచి 60 రోజులలోపు కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక జరగాలి. మున్సిపల్ పాలకవర్గ వర్గం ఉన్నంత వరకు కో-ఆప్షన్ సభ్యులు వారితో సమానంగా కొనసాగుతారు. వీరికి గౌరవేతనం, ఇతర ప్రోత్సాహకాలు కౌన్సిలర్లతో సమానంగా తీసుకుంటారు. మున్సిపల్ సమావేశంలో వీరు పాల్గొనవచ్చు. ప్రజాపాలనపై చర్చించవచ్చు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే హక్కు మాత్రం వీరికి ఉండదు. అయితే వరుసగా మూడు సమావేశాలకు హాజరు కాకపోతే వారి సభ్యత్వం రద్దు అయ్యే అవకాశం ఉంటుంది.

# ఎరువుల వాడకం తగ్గించాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** రసాయన ఎరువులను తగు మోతాదులోనే వాడాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతులకు సూచించారు. శనివారం నల్లబెల్లి మండలం కొండాయిలపల్లి గ్రామంలో మిర్చి రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, లేదంటే భూసారం దెబ్బతిని పంటలు పండే పరిస్థితి ఉందన్నారు. మిర్చి సాగు చేసిన రైతులు కోత అనంతరం మార్కెట్ తీసుకువచ్చేటప్పుడు తేమ లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ వ్యవసాయ మార్కెట్ కు రైతులు మిర్చీ తీసుకువచ్చేటప్పుడు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా నాణ్యమైన సరుకును తీసుకు వచ్చినట్లయితే మార్కెట్ లో మంచి ధర లభిస్తుందన్నారు. మిర్చి ధరలను ఎలక్ట్రానిక్ బోర్డులపై డిస్ప్లే అయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. రైతులు ధర విషయంలో ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని నాణ్యమైనటువంటి మిర్చిని మార్కెట్ కి తీసుకురావాల్సిందిగా కోరారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ విదేశాలకు ఎగుమతి చేయడానికి పాటించవలసిన నాణ్యత ప్రమాణాల గురించి, మిర్చి ఆరబెట్టేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, అధిక దిగుబడికి రైతులు పాటించవలసిన మేలైన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, సర్పంచ్ ఎరుకల స్వప్న, జిల్లా వ్యవసాయ అధికారులు అనురాధ, అగ్రికల్చర్ ఆఫీసర్, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్కెట్ ఆఫీసర్ సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు, మండల పరిషత్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్, డివిజన్ అగ్రికల్చర్ ఆఫీసర్ దామోదర రెడ్డి, ఉద్యాన అధికారి టెక్నికల్ సి.రాకేష్, ఉద్యాన అధికారిని జ్యోతి, అగ్రికల్చర్ ఆఫీసర్ రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# వన్నాల విజయ లక్ష్మికి ఘన నివాళి

□ ప్రథమ వర్ధంతికి పలువురు ప్రముఖుల హాజరు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు సతీమణి కీ.శే. వేముల @ వన్నాల విజయ లక్ష్మి ప్రథమ వర్ధంతి హంటర్ రోడ్ లోని అలకనందా ఏసీ పంక్షన్ హాల్ లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ వేముల సత్యమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు, వరంగల్ వాయిస్ ఎడిటల్ గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు వేముల సదానందం నేత, చెరుకు వేణు ప్రసాద్, వనం శ్రీకాంత్ తదితరులు పాల్గొని స్వర్గీయ వన్నాల విజయ లక్ష్మి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వన్నాల శ్రీరాములు-విజయ లక్ష్మి దంపతుల తనయులు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ, వాక్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ చైర్మన్, బిల్లా-రంగా చలనచిత్ర నిర్మాత వన్నాల అరవింద్ కుమార్, ప్రవాస భారతీయుడు వన్నాల రాజేశ్ కన్నా, తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com